క్లుప్తంగా

మక్తల్‌లో క్రీడా అభివృద్ధికి కృషి



మాగనూర్: మక్తల్ లాంటి వెనుకబడిన ప్రాంతంలో మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించి క్రీడా అభివృద్ధికి కృషి చేస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మక్తల్ మినీ స్టేడియాన్ని స్పోర్ట్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఆరోగ్యకర జీవనానికి ప్రతి ఒక్కరు వాకింగ్, జాగింగ్‌ను తమ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న ఇందిరమ్మ క్యాంటీన్‌లో ప్రజలతో కలిసి అల్పాహారం చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



మరికల్: మండలంలోని తీలేర్‌లో నూతనంగా నిర్మిస్తున్న అవదూత రామకృష్ణ ఆనంద గురు స్వామి దత్తాత్రేయ స్వామి ఆలయ నిర్మాణానికి సూర్యచంద్ర ఫౌండేషన్ తరఫున విరాళం అందజేశారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ అధినేత సూర్యమోహన్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు రూ.51 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో రఘుపతిరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బీసీ జాగృతి అధ్యక్షుడిగా గజలప్ప ఎంపికపై హర్షం

దామరగిద్ద: మండల బీసీ జాగృతి అధ్యక్షుడిగా బాపన్‌పల్లి గ్రామానికి చెందిన గజలప్ప ఎంపిక కయ్యారు. ఈ క్రమంలో మండల బీసీ నాయకులు గణేష్, తరుణ్, ప్రవీణ్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు ఎల్ల కుర్మయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ జాగృతి సేనా అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకోవడం సంతోషనీయమన్నారు. బీసీలను జాగృతం చేయడంలో గజలప్ప తన వంతు కృషి చేయాలని కోరారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేద్దాం

ఊట్కూరు: మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేద్దామని మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. మంగళవారం ఊట్కూరులోని 3940 బూత్‌లకు కమిటీలను ఎన్నుకున్నారు. 39వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా అవినాష్, 40 వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా గోవర్ధన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, నాయకులు కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

మద్దూరు: దమ్‌గాన్‌పూర్ పీఏసీఎస్ కార్యాలయంలో సబ్సిడీ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు విత్తనాలను తీసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరిలో ఆర్ఎన్ఆర్ రకం 25 కేజీల బస్తా రూ.1075, బీపీటీ రకం 25 కేజీల బస్తా రూ. 1137.50లకు అందించనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదార్ పాసు పుస్తకం తీసుకొచ్చి వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కృష్ణా: మండల కేంద్రంతో పాటు తంగిడి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ధర్మతేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందుపూర్ గ్రామ శివారులోని 33 కేవీ విద్యుత్‌లైన్‌కు మరమ్మతు చేస్తుండడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ధన్వాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా శంకరయ్య

ధన్వాడ: మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా శంకరయ్య ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ధన్వాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ రిపోర్టర్ శంకరయ్యను ధన్వాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా అంజనేయులు, శ్రీనివాసులునాయుడు, ప్రధాన కార్యదర్శిగా మాకం వీరేష్‌కుమార్, కార్యదర్శిగా రఘవేందర్, సలహదారుడిగా నర్సిములు, కోశదికారిగా కోం డన్న, కార్యదర్శులుగా ప్రశాంత్, బాలరాజులను ఎన్నుకున్నారు.

జీలుగ సాగుతో లాభాలెన్నో..

మద్దూరు: తక్కువ సారవంతమైన భూములకు ఎక్కడి నుంచో మట్టిని తీసుకొచ్చి పోలంలో వేసి డబ్బును వృథా చేసుకోవడం కన్నా నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట ఎరువుల సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చు. ఇందులో జీలుగ సాగు చక్కటి ఫలితాలను ఇస్తోంది. నేల స్వభావాన్ని బట్టి జీలుగ సాగు చేసుకుంటే ఆపై వేసే పంటలకు అనుకూలంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల కోసం నిర్దేశించిన మొక్కలను పొలంలోనే కలియదున్నడం వల్ల అవి కుళ్లి భూమిని సారవంతం చేస్తాయని పేర్కొంటున్నారు.

30 రోజుల్లో పంట చేతికి

ఏకవార్షిక మొక్కల్లో ప్రథమ స్థానం జీలుగదే. మొక్కలు నాటిన 25 నుంచి 30 రోజుల్లోనే పంట ఏపుగా పెరుగుతుంది. ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలను సిద్ధం చేసుకోవాలి. దుక్కిలో 20 నుంచి 30 కిలోల యూరియా వేసి ఆపై విత్తనాలను చల్లుకోవాలి. బిందుసేద్యం ద్వారా అయితే సాళ్లలో విత్తుకోవాలి. మొక్కలు బాగా పెరిగేందుకు క్రమపద్ధతిలో తడులు ఇవ్వాలి. 25 నుంచి 30 రోజులకు మొక్క ఏపుగా పెరిగి పూతదశకు చేరుకుంటుంది. ఆ సమయంలో మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించాలి లేదా రోటోవేటర్ సాయంతో కలియదున్నాలి. దున్నిన అనంతరం 100 కిలోల సిగింల్ సూపర్ ఫాస్ఫేట్‌ను దుక్కిలో వేయాలి. సూపర్ ఫాస్ఫేటు వల్ల మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్టె ఎరువులు తయారవుతాయి.

భూమి సారవంతం

పొలంలో జీలుగను కలియదున్నిన తర్వాత అవి నేలకు, ఆపై వేసే పంటలకు విశేషమైన లాభాలు అందిస్తుంది. ప్రధాన పంటకు ముందస్తుగా నేలను తయారు చేస్తుంది. జీలుగ సాగు వల్ల మూడు టన్నుల పచ్చిరొట్టె ఎరువులు లభిస్తాయి. మొక్కలకు 2 శాతం నత్రజని, సూపర్ ఫాస్ఫేటును అదనంగా అందిస్తాయి. జింక్, మాంగనీసు, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులను పంటకు చేకూర్చుతాయి. నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతాయి.



జీలుగ విత్తనాలు, పంట

నీటి నిల్వ సామర్థ్యం పెంచుతాయి

నేల సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తాయి. లెగ్యూ జాతికి చెందిన మొక్క కావడంతో వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుంది. తుంగ, గెరిక వంటి కలుపు మొక్కలను అడ్డుకుంటుంది.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు



మండలంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో, పీఏసీఎస్ కార్యాలయంలో సబ్సిడీపై జీలువ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ రామకృష్ణ తెలిపారు. 100 కేజీల బస్తా రూ.14,250. కాగా సబ్సిడీ రూ.7,125 పోను రూ.7,125కే అందిస్తామన్నారు. ఇందులో 30 కేజీల బస్తాకు సబ్సిడీ పోను రూ.2,137.50 కు అభిస్తుందన్నారు. అవసరమైన రైతులు పట్టదారు పాసుబుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.

– రామకృష్ణ, మద్దూరు వ్యవసాయ అధికారి

రేషన్ షాపులలో అక్రమాలు అరికట్టండి



మాగనూర్: మండల పరిధిలోని రేషన్‌షాపులో జరుగుతున్న అక్రమాలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు బాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని పలు రేషన్ షాపులలో ప్రజల బియ్యాన్ని తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపించారు. చౌకదార దుకాణాలు ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉన్న , కొందరు నెలలో నాలుగు రోజులు మాత్రమే రేషన్ సరఫరా చేసి సమయం ముగిసిందని చెబుతున్నారని అన్నారు. పేదలకు చేరాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

మద్దూరు: రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మద్దూరు పాతబస్టాండ్ చౌరస్తాలో రైతు సంఘాల పిలుపు మేరకు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు మద్దతు ధరతో పాటు 50 శాతం కలిపి ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీల కుటుంబాలకు ఏడాదిలో 200 రోజుల పని దినాలు కల్పించి రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు కొండ నర్సిములు, ఆశప్ప, అంబటి నర్సిములు, పుష్ప, కవిత, అంజి, విజయ్, హన్మప్ప, సాయిలు, ఎల్లప్ప పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే వాకిటి



మాగనూర్(మక్తల్): పేదలకు సీఎం సహాయనిధి ఒక వరమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ఉట్కూర్ మండలం పెద్దజట్రం గ్రామానికి చెందిన జయమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేష్, వెంకటేష్‌గౌడ్, రవి, నర్సింహ పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోవాలి

మద్దూరు: రైతులకు ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు కోసం చేపట్టిన రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రక్రియ మండలంలో ప్రారంభమైందని ఇన్‌చార్జి ఏఓ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు తమ పరిధిలోని ఏఈఓలకు పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్ కార్డు నెంబర్, ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నెంబర్ అందజేయాలని సూచించారు. నమోదు సమయంలో మొబైల్ నెంబర్‌కు మూడు ఓటీపీలు వస్తాయని వాటిని అధికారులు నమోదు ప్రక్రియలో ఉపయోగిస్తారని తెలిపారు. నమోదు పూర్తయిన తర్వాత రైతులకు 11 అంకెలతో కూడిన రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేయనున్నట్లు తెలిపారు. దీన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బక్రీద్ శాంతియుతంగా జరుపుకోవాలి

మరికల్: బక్రీద్ పండగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మరికల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇరు వర్గాలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవులను వధిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా గోవులను తరలిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాము, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శాంతి సమావేశం

నర్వ: బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ కురుమయ్య సూచించారు. మంగళవారం నర్వ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దలు అలాగే విశ్వహిందూ పరిషత్ నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు. వధశాలలో గోవులను వదించరాదన్నారు. వెటర్నరీ డాక్టర్ సర్టిఫైడ్ చేసిన వాటినే వధించాలన్నారు. అక్రమంగా గోవులను వదిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గోవుల అక్రమ రవాణా జరిగితే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ

నిబంధనలు పాటించాలి

ధన్వాడ: బక్రీద్‌ను ముస్లింలందరు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పండుగ సందర్భంగా మంగళవారం వధశాలలకు చెందిన ఆర్గనైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గోవులను అక్రమ రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వధశాలలో జంతువులను వధించాలంటే వెటర్నరీ డాక్టర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొడదాం

నర్వ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నర్వ తహసీల్దార్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మల్లారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు.

కలిసి పోరాడుదాం

మాగనూర్: జాతీయ కార్మిక సమ్మెలో భాగంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుంజనూర్ ఆంజనేయులు మంగళవారం మాగనూర్‌లో వివిధ కార్మిక సంఘాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి, కొన్నింటిని రద్దు చేసి యజమానులకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లు తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ సమ్మె చేపట్టినట్లు తెలిపారు. లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు కార్మికులందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాలు, చిన్న నర్సింహ, నాయ్యిం, బాబు, రాఘవేంద్ర, ఆశ కార్యకర్తలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపాలి

మరికల్: కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు నరహరి డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు ఆశా కార్యకర్తలు, కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. అలాగే వైద్య ఆరోగ్య రంగలో ప్రైవేటీకరణ విధానం ఆపాలని డిమాండ్ చేశారు.



ఉట్కూరు తహసీల్దార్ కార్యాలయం ముందు కార్మికుల ధర్నా



కోస్గిలో ఆశా కార్యకర్తల నిరసన ర్యాలీ

ప్రజా వ్యతిరేక విధానాలు మార్చుకోవాలి

కోస్గి రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శివాజీ చౌరస్తాలో మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్స్ , ఆశా కార్యకర్తలతో నిరసన వ్యక్తం చేశారు. 29 చట్టాలను సవరించి కార్పోరేట్ యజమానులకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేదల మీద భారం వేసి కార్పొరేట్లకు మాత్రం రాయితీలు కల్పించడంపై మండి పడ్డారు.

తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

ఊట్కూరు: దేశ వ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా మంగళవారం ఊట్కూరు తహసీల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు సలీం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడి కార్మిక సంఘాలతో చర్యలు జరపాలని కోరారు. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



దామరగిద్ద క్యాతన్‌పల్లిలో నాయకుల నిరసన

వేతనం రూ.26 వేలు చెల్లించాలి

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ సమ్మెలో భాగంగా క్యాతన్‌పల్లి, మొగుల్‌మడ్క, అన్నాసాగర్, ముస్తాపేట్ కంసాన్‌పల్లి గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని డిమాండ్ చేశారు.

వెనకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

మాగనూర్: వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈఓ మురళీధర్ రెడ్డి టీచర్లకు సూచించారు. ఎస్సీఈఆర్టీ, సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రైమరీ టీచర్స్ శిక్షణ కార్యక్రమం మంగళవారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మొదలైంది. ఈ కార్యక్రమంలో మురళీధర్‌రెడ్డి పాల్గొని టీచర్లకు పలు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమం ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు ఉంటుందన్నారు. వృత్యంతర శిక్షణా కార్యక్రమంలో అన్ని సబ్జెక్ట్స్‌పై అవగాహన పెంచుకొని పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఈ కార్యక్రమాన్ని సద్వినయోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాలు పెంచేందుకే..

నర్వ: ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ బోధన సామర్థ్యాలు అలాగే విద్యారులు అభ్యాసన సామర్థ్యాలు పెంచుకునేందుకు ఈ 5 రోజుల శిక్షణ కార్యక్రమం ఎంతోగానో ఉపయోగపడుతుందని కోర్స్ డైరెక్టర్ బి.రాంరెడ్డి తెలిపారు. మంగళవారం నర్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్పీ జానకిరామ్, ఎంఆర్పీలు వెంకటేష్, అనిల్, ప్రదీప్, శివశంకర్, రాజు, హరిశంకర్, సీఆర్పీ నర్సిములు, హెచ్ఎంలు రాఘవరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జనార్ధన్, ఉస్మాన్, పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ మురళీధర్ రెడ్డి

సద్వినియోగం చేసుకోవాలి

ఊట్కూరు: శిక్షణను టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని కోర్స్ డైరెక్టర్ మాధవి సూచించారు. మంగళవారం ఊట్కూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకున్నప్పుడే విద్యార్థులకు వినూత్న పద్ధతుల్లో బోధన చేయగలుగుతారన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

దామరగిద్ద: ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు వృత్యంత్తర శిక్షణ తరగుతులను మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. కోర్సు డైరెక్టర్ కృష్ణారెడ్డి శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్-కెపాసిటీ బిల్డింగ్ ప్రైమరీ గ్రేడ్ టీచర్స్‌కు పాఠ్యంశ భోదనపై నూతన విద్యావిధానానికి అనుగుణంగా ఆర్పీలు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

వాల్మీకుల ఐక్యతకు గ్రామ కమిటీలు

నర్వ: వాల్మీక బోయల ఐక్యత కోసం గ్రామ గ్రామాన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వాల్మీకి బోయ సంఘం జిల్లా నాయకులు ఎం.లక్ష్మన్న అన్నారు. మంగళవారం మండల అధ్యక్షులు కావలి అయ్యన్న అధ్యక్షతన పెద్దకడ్మూర్ గ్రామ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షులుగా సాతర్ల దేవరాజు, ఉపాధ్యక్షులుగా ముమ్మలి దేవేందర్, మొరిగెని శ్రీనువాసులు, ప్రచార కార్యదర్శిగా సోకిరి గోవిందు, కార్యదర్శులుగా వెంకటన్న, రామలింగం, అంజి, రాము, అంజన్న, ఉమాశంకర్, రాజేందర్, వెంకటేష్, హన్మంతులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సీరజ్, గడ్డం నర్సింములు, లక్ష్మన్న, మండల అధ్యక్షులు కావలి అయ్యన్న, ప్రధానకార్యదర్శి ముమ్మలి రాములు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

శివాజీ విగ్రహ ఏర్పాటుకు ఆర్థికసాయం

నారాయణపేట: మండలంలోని పేరపళ్లలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విగ్రహ ఏర్పాటుకు గాను మంగళవారం రూ.2.50 లక్షల చెక్కును ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ నిర్వహకులకు అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ ఉత్సవ కమిటీ నిర్వాహకులు సాయికుమార్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుక భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. శివాజీ విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



చెక్కు అందజేస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

కేటీఆర్‌ను కలిసిన ‘పేట’ నాయకులు

నారాయణపేట: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును మంగళవారం ఆయన స్వగృహంలో నారాయణపేట నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధి పనులను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలం కావడంతో నియోజకవర్గంలోని ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నరని తెలిపారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎప్పటి కప్పుడు ప్రభుత్వాన్ని నిలదీస్తుండాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బాపన్‌పల్లి శ్రీనివాసులు, గాని శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి ఉన్నారు.



కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాయకులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ: డీఎస్పీ

నారాయణపేట: జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలని డీఎస్పీ నల్లపు లింగమయ్య పోలీసులను ఆదేశించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కమాండ్ కంట్రోల్‌లోని సీసీ కెమెరాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కమాండ్ కంట్రోల్ పోలీసులు నిరంతరం సీసీ కెమెరాలను పరిశీలిస్తూ ఉండాలని జిల్లా కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా గ్రామాల్లో , కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ నరేశ్, ఐటికోర్ పిసి శ్రీనివాసులు, కమాండ్ కంట్రోల్ టీం పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

భక్తిశ్రద్ధలతో సవారమ్మ జాతర

అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవారమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో స్థిరపడిన పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కోళ్లు, పోటేళ్లు, టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే జైలుకే

రాజాపూర్: గ్రామాల్లో రైతులకు సీడ్ డీలర్స్ నకిలీ విత్తనాలు విక్రయించినట్లు సమాచారం అందితే అలాంటి వారిపై పీడీయాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ సీడ్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు కల్లేపల్లి, రంగారెడ్డిగూడ గ్రామాల్లోని సీడ్ షాప్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని స్టాక్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో డీలర్ నుంచి ఖచ్చితంగా బిల్లు తీసుకోని పంటకాలం వరకు భద్రపరుచుకోవాలన్నారు. రైతులకు అందుబాటులో నాణ్యమైన వ్యవసాయశాఖ సర్టిఫైడ్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున ప్రతి డీలర్ సరైన ఎరువుల నిలువలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏఈఓ రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కల్లేపల్లిలో సీడ్ షాప్‌లో తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌గౌడ్